
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 1 ఆగస్టు 2024



తవ్వుకో.. అమ్ముకో!

- కడపలో మళ్లీ మొదలైన మట్టి, ఇసుక దందా
- విచ్చలవిడిగా రేయింబవళ్లు తవ్వకాలు
- ట్రాక్టర్లను పట్టుకుంటే.. మేమే విడిపిస్తామంటూ యజమానులకు భరోసా
- టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలింపు
- ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన వైసీపీ నేతల నిర్వాకం



బుడ్డాయపల్లె చెరువులో యంత్రాల ద్వారా మట్టిని తీస్తున్న దృశ్యం

(కడప - ఆంధ్రజ్యోతి): అవును.. మళ్లీ కడపలో సహజ వనరుల దోపిడీ మొదలైంది. వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఇసుక, మట్టి గ్రావెల్‌ను తవ్వేశారు. పర్యావరణానికి హానీ కలిగించే విధంగా తవ్వకాలు జరిపారు. ఇక అప్పట్లో అధికారులంతా వైసీపీకి జీహుజూర్ అంటూ పనిచేయడంతో వారి అవినీతి అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్పు వచ్చింది. ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక పాలన అమలులోకి తెచ్చారు. అందుబాటులో ఉన్న ఇసుకను హ్యాండ్లింగ్ చార్జీలు, రవాణా చార్జీలు చెల్లించి తీసుకుపోయేటట్లు కల్పించారు. కొద్దిరోజులు అక్కడక్కడా ఇసుక తవ్వకాలు జరిగాయి. అయితే ప్రభుత్వం సీరియస్ కావడంతో మళ్లీ ఆగిపోయాయి. అయితే ఇప్పుడు కడపలో మళ్లీ మట్టి, ఇసక తవ్వకాలు సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది. ఇసుక, మట్టి ప్రభుత్వ భూముల జోలికి పోవద్దంటూ సీఎం చంద్రబాబునాయుడు చెబుతూ వస్తున్నారు. అయితే ఇంకా కొందరిలో మార్పు రాలేదు. ఎన్నికల ముందు కొందరు వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయ్యారు. అక్కడ వైసీపీలో అడ్డగోలు పనులు చేశారు. ఆ బ్యాచ్ ఇప్పుడు టీడీపీలో తిష్ట వేసింది. దీంతో జిల్లాలో కొన్ని చోట్ల వైసీపీ నారు టీడీపీ హయాంలో కూడా సేమ్ టు సేమ్ వ్యవహరిస్తోంది. కడపలో కూడా కొందరు ఇసుక, మట్టిని అడ్డంగా తవ్వేసి లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

కడప నగర పరిధిలోని బుడ్డాయపల్లె చెరువులో ఇటీవల పగలు రాత్రి నిర్విరామంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. రెండు రోజులకు అనుమతి తీసుకోవడం, వాటిపైనే ఇష్టా రాజ్యంగా తవ్వేస్తున్నారు. ఈ బ్యాచ్ చెరువులో ఎక్స్‌కవేటర్లు పెట్టి రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా, రాత్రిపూట టిప్పర్ల ద్వారా తోలుతున్నట్లు చెబుతున్నారు. ట్రాక్టరుకు అయితే రూ.500, టిప్పరు ద్వారా అయితే దూరాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.4500 తీసుకుంటున్నట్లు చెబుతున్నా రు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, భవన నిర్మాణాల లెవలిం గ్‌కు మట్టికి డిమాండ్ ఉంది. ఇదే అదనుగా భావించి కొందరు నేతలు మట్టి అక్రమ రవాణాకు తెర లేపారంటారు.

వాటర్ గండి నుంచి ఇసుక

జగన్ హయాంలో ఇసుక బంగారమైంది. భవన నిర్మాణాలకు ఇసుక దొరకక అగచాట్లు పడేవారు. 2014-19 చంద్రబాబు హయాంలో ఉచితంగా ఇసుక ఇచ్చేవారు. అప్పట్లో ట్రాక్టరు ఇసుక రూ.3వేలకు దొరికేది. జగన్ హయాంలో అది డబుల్ అయింది. ఎన్నికల హామీ మేరకు ఉచితంగా ఇసుక ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే అమలు చేస్తున్నారు. ప్రస్తుతం స్టాకు పాయింటులోని ఇసుక రవాణా చార్జీలు చెల్లించి తీసుకెళ్తున్నారు. స్టాకు పాయింట్లలో ఇసుక నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీన్ని కొందరు క్యాష్ చేసుకుంటు న్నారు. వాటర్‌గండి నుంచి ఇసుక యథేచ్ఛగా తరలుతున్నట్లు చెబుతున్నారు. పగటిపూట ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకువచ్చి ఓప్రాంతంలో డంప్ చేసి రాత్రిపూట టిప్పర్ల ద్వారా కడప, ఇతర ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలకు తీసుకువెళుతున్నట్లు చెబుతున్నారు.



వాహనాలు పట్టుకుంటే.. మేమే విడిపిస్తాం

ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. పదిరోజుల క్రితం వాహనాలు పట్టుకున్నారు. దీంతో ఇసుక, మట్టి కోసం అనుమతులు లేని చోట తవ్వకాలకు ట్రాక్టర్లను పంపేందుకు యజమానులు భయపడి వెళ్లే వారు కాదు. అయితే ఈ బ్యాచ్ మీ వాహ నాలు పట్టుకోకుండా మేం చూసుకుంటాం.. ఒకవేళ పట్టుకున్నా కూడా మేమే విడిపిస్తాం, మీరేం భయపడవద్దు అంటూ అభయమిస్తుండడంతో అక్రమ రవాణాకు వారు ట్రాక్టర్లను పంపిస్తున్నారు. మొత్తానికి అయితే.. మళ్లీ ఇసుక, మట్టి రవాణాను మొదలుపెట్టడం చూసి అలవాటుపడ్డ ప్రాణం యాడ ఊరకుంటుందంటూ కొందరు అధికార పార్టీ నేతలు సెటైర్ వేసుకుంటున్నారు.

పేదల జీవితాల్లో మార్పు తేవాలనే హౌసింగ్ ఫర్ ఆల్

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 31: పేదల జీవితాల్లో మార్పు తేవాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమం చేపట్టిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే కీలకమైన ఐదు ఫైళ్లపై సంతకం చేసిం దన్నారు. వేలాది మంది నిరుద్యోగులు, రైతులు, యువత పేదలకు లబ్ధి చేకూరిందన్నారు. హౌసింగ్ ఫర్ ఆల్ నినాదంతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. లక్షల ఎకరాలు దోచుకోవడానికి వైసీపీ నేతలకు భూమి ఉం ది కానీ పేదవారికి రెండు సెంట్లు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వంలో భూమి లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామా ల్లో 3 సెంట్లు పేదలకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. సొంత స్థలం ఉండి కూడా ఇళ్లు నిర్మించుకోలేని మధ్యతరగతి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4లక్షలు ఇంటి నిర్మాణానికి సహాయం అందించనుందన్నారు. గత ప్రభుత్వంలో పూర్తి చేయకుండా నిలిపివేసిన ఇళ్లను ఈ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణంలోపేద ప్రజలు ఇబ్బందులు పడకూడదని ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. అలాగే జర్నలిస్టులకు కూడా ఎన్‌డీఏ ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వనుందని స్పష్టం చేశారు.

జిల్లాలో డీఎస్పీలు, సీఐల బదిలీలు

కడప (క్రైం), జూలై 31 : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సబ్ డివిజన్‌లు, కేటగిరిలలో పనిచేస్తున్న 96 మంది డీఎస్పీల బదిలీలు, నియామకాలు చేపడుతూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ఆర్ జిల్లాలో ఆరుగురు డీఎస్పీల బదిలీలు, నియామకాలు జరిగాయి. అలాగే జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎస్పీ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
జి.హుసేన్‌పీరా	డీఎస్పీ అప్పాఅటాచ్డ్ - పీటీసీ అనంతరంపురం	జమ్మలమడుగు
బుక్కే మురళి	డీఎస్పీ ఇంటెలిజెన్స్ అటాచ్డ్, పీటీసీ, తిరుపతి	పులివెందుల
కేఎస్ వినోద్‌కుమార్	పులివెందుల	పోలీసు హెడ్‌క్వార్టర్స్
ఎం.భక్తవత్సలం	2వ బెటాలియన్, ఏపీఎస్పీ	ప్రొద్దుటూరు
డి.మురళీధర్	ప్రొద్దుటూరు	పోలీసు హెడ్‌క్వార్టర్స్
కె.రవికుమార్	డీపీటీసీ, కడప	ఎస్‌డీపీవో, ఆళ్లగడ్డ

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
బి.రామక్రిష్ణ	ఎస్‌హెచ్‌ఆర్‌జీ, కర్నూలు	కడప వన్‌టౌన్ పీఎస్
సి.భాస్కర్‌రెడ్డి	కడప వన్‌టౌన్ పీఎస్	వీఆర్, ఎస్‌పీ, కడప
ఎస్.తేజ్‌మూర్తి	ఆదోని, వన్‌టౌన్ పీఎస్	చిన్నచౌకు పీఎస్, కడప
పి.నరసింహారెడ్డి	చిన్నచౌకు పీఎస్, కడప	వీఆర్, ఎస్‌పీ, కడప
కె.శ్రీనివాసనాయక్	సీసీఎస్, కడప	ఆలూరు పీఎస్, కర్నూలు
పి.రామాంజులు	ఖాజీపేట, పీఎస్	మంత్రాలయం సర్కిల్
జె.శివశంకర్	వీఆర్, కడప	మైదుకూరు రూరల్
ఎం.శ్రీనాథరెడ్డి	మైదుకూరు రూరల్	వీఆర్, ఎస్‌పి, కడప
పి.నరేశ్‌బాబు	వీఆర్, అన్నమయ్య	ఎర్రగుంట్ల, పీఎస్
ఆర్.ఈశ్వరయ్య	ఎర్రగుంట్ల, పీఎస్	వీఆర్ ఎస్‌పీ, కడప

అక్కడ హిందువులదే పీర్ల పండుగ

- ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు
- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూడుపల్లె గ్రామం
- ప్రారంభమైన ఉత్సవాలు.. నేడు పీర్ల ఊరేగింపు



గూడుపల్లెలో ఏర్పాటు చేసిన పీర్లు

ములకలచెరువు, జూలై 31: అవును మీరు విన్నది నిజమే.. ఆ గ్రామంలో ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. అయినా పీర్ల పండగను వైభవంగా జరుపుకుంటున్నారు. అక్కడ ఉన్నది అందరూ హిందువులే. గ్రామం మొత్తం చూసినా ఒక్క ముస్లిం కూడా లేడు. సహజంగా పీర్ల పండగ (మొహరం)ను ముస్లింలు చేస్తుంటారు. కొన్ని చోట్ల హిందూ-ముస్లింలు కలిసి చేసుకుంటారు. పీర్ల పండగ ముస్లింలకు చెందిన పండగగా చెప్పుకుంటారు. అయితే ఇక్కడ మాత్రం మత సామరస్యానికి ప్రతీకగా హిందువులంతా కలిసి పీర్ల పండగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ములకలచెరువు మండలం గూడుపల్లెలో 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇది మారుమూల గ్రామం. ఇక్కడ అందరూ హిందువులే ఉన్నారు. ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. ఇలాంటి గ్రామంలో హిందువులందరూ కలిసి ప్రతి ఏడాది పీర్ల పండుగను వైభవంగా చేసుకుంటున్నారు. హిందువులే పీర్లను తయారు చేయించారు. పక్కగ్రామమైన కోనేటివారి పల్లె పంచాయతీ దాశెట్టివారిపల్లె నుంచి ముస్లిం మత గురువు హైదర్‌వలిని పిలిపించి పండుగను జరుపుకుంటున్నారు. ఈసారి కూడా పీర్ల పండుగను జరుపుకోవాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి పీర్ల పండుగను ప్రారంభించారు. గ్రామ చావిడిలో పీర్లను ఏర్పాటు చేశారు. ముస్లింలే లేని గ్రా మంలో పీర్ల పండుగను చేసుకుంటున్న హిందువులు పీర్లను ముస్లింల పేరుతో తయారు చేయించడం ఆదర్శంగా నిలుస్తోంది. పీర్లను ఏర్పాటు చేసే సమయంలో గ్రామస్థులంతా చావిడి వద్దకు చేరుకున్నారు. పీర్లను ఏర్పాటు చేసే చావిడి ముందు అగ్నిగుండం తవ్వారు. దాశెట్టివారిపల్లె నుంచి వ చ్చిన మత గురువు హైదర్‌వలి పీర్లను ప్రతిష్ఠించారు. ఈ క్రమంలో గ్రామంలోని హిందువులు పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురు, శుక్రవారం పీర్లను పూలతో అ లంకరించి గ్రామంలో ఘనంగా ఊరేగించనున్నారు. ఆగస్టు 4వ తేదీ జల్టి (పీర్లకు వీడ్కోలు) కార్యక్రమం జరగనుంది. హిందువులే పీర్లను ఏర్పాటు చేయడం...పీర్ల ముందు ప్రత్యే క ప్రార్థనలు చేయించడం, పీర్లను ఎత్తుకుని గ్రామంలో ఊరేగించడం...అగ్నిగుండం చుట్టూ ఎగరడం చూస్తుంటే మతసామరస్యం ఈ గ్రామంలో ఉట్టిపడుతోంది.

బహిరంగ మద్యపానం అడ్డుకోండి

- రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- మైదుకూరు, బద్వేలు, పోరుమామిళ్ల పోలీసు స్టేషన్ల తనిఖీ



మైదుకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మైదుకూరు రూరల్, జూలై 31: బహిరంగంగా మద్యం సేవించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు డీఎస్పీ వెంకటేశులును ఆదేశించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం, మైదుకూరు అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పోలీసులు ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసుల్లా వ్యవహరించాలని తెలిపారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలని తెలిపారు. చోరీలు జరుగకుండా గస్తీలు ముమ్మరం చేయాలని, స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎర్రచందనం అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఎస్పీతో పాటు సీఐలు మస్తాన్, శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సై ఘనమద్దిలేటి తదితరుల ఉన్నారు.

బద్వేలుటౌన్ : బద్వేలు అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. భారతీయ న్యాయ సంహితపై అవగాహన పెంపొందించుకోవాలని పోలీస్ అధికారులకు సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీచేశారు. మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు, అర్బన్ సీఐ యుగంధర్, రూరల్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి సీఐ చిరంజీవి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని బహిరంగ ప్రదేశాల్లో మద్యం అమ్మకాలు లేకుండా చూడాలని, పోలీసుస్టేషన్ ఆవరణంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిమోతి పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 31: స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేం దుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఏఎస్పీ సుధాకర్‌తో కలసి అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 15వ తేదీ నిర్వహించే జెండా వందన కార్యక్రమానికి వేదికను అందంగా తీర్చిదిద్దాలని పోలీసు అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. తాగునీరు, టాయి లెట్స్ సౌకర్యాలు కల్పించాలని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనరు రాకేష్‌ను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటి చెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, జలవనరులశాఖ, వ్యవసాయం, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఆయాశాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువులోగా అందివ్వాలని కలెక్టర్ అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమలో ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటపతి, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, సీపీవో వెంకట్రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, డీటీసీ మీరాప్రసాద్ అన్ని శాఖల అధి కారులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- ఉదయం 4 గంటల నుంచే పంపిణీ చేపట్టాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 31: పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరగాలని, అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ క్షేత్ర స్థాయి అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పథకం కింద చేపట్టనున్న పెన్షన్ పంపిణీ కార్య క్రమంపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ పంపిణీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. పెన్షన్లు సజావుగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం బయోమెట్రిక్ డివైజ్, యాప్‌లో ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీలు లేదన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించాలని, మండల స్పెషల్ అధికారులు రాత్రికి మండల కేంద్రాల్లో ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. సంబంధిత బ్యాంకుల నుంచి ముందుగానే పెన్షన్ సొమ్ము మొత్తాన్ని డ్రా చేసుకోవాలన్నారు. 1వ తేదీ ఉదయం 4 గంటల నుంచి క్షేత్రస్థాయిలో సిబ్బంది వెళ్లి పెన్షన్ పంపిణీ ప్రారంభించి సాయంత్రం 6గంటలలోగా 100 శాతం పూర్తి చేయాలన్నారు. పెన్షన్ దారులందరూ ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండి పెన్షన్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సుధాకర్‌రెడ్డి, ఆనంద్‌నాయక్, ప్రభాకర్ రెడ్డి, వైఏ నందన్, ఇన్‌చార్జి మున్సిపల్‌కమిషనర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సహకరించండి

జిల్లా సమగ్రాభివృద్ధికి తమ వంతు సహకారం అందించి... తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ మీడియా ప్రతినిధులను కోరారు. బుధవారం కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో హాలులో మీడియాతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు ఎంతో ప్రాము ఖ్యత ఉందని.. జిల్లాకు సంబంధించి ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడైనా లోపాలు మీ దృష్టికి వస్తే.. వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో భూ అక్రమణలపై ప్రతి రోజు కథనాలు పత్రికల్లో వస్తున్నాయని.. దీనికి సబ్ కలెక్టర్ స్థాయి అధికారిని తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజల నుంచి తనకు అందిన ఫిర్యాదులలో ముఖ్యమైన వాటిని ప్రతి శుక్రవారం అధికారులతో చర్చించి పరిష్క రిస్తామన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. అనంతరం మీడియా ప్రతినిధులు కలెక్టర్‌ను సన్మానించారు.

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే బాధ్యత మీదే

- జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, జూలై 31: దోమల నివారణకు ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత మీపై ఉంటుందని జిల్లా మలేరియా అధికారి మనోరమ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని ఇస్లాంపురం ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. దోమలు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలపాలన్నారు. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డ్రైడే గురించి క్షుణ్ణంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాజామొద్దీన్, డాక్టర్ శాంతికుమార్, డాక్టర్ అఫ్రిన్, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సీహెచ్ఓ రెడ్డమ్మ, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నమ్మిస్తారు.. ఆపై దోచేస్తారు

- ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో ఎర
- లింకులను క్లిక్ చేస్తే అంతే మరి
- 19 నెలల్లో 70 ఫిర్యాదులు





కడప (క్రైం), జూలై 31: వారంతా.. ఎక్కడుంటరో తెలియదు, ఏం చేస్తుంటారో అంత కన్నా తెలియదు. కానీ ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో వల విసిరి నిరుద్యోగులను నిలు వునా దోచుకుంటున్నారు. వర్క్‌ఫ్రంహోం పేరుతో రకరకాల వెబ్‌సైట్లను సోషల్ మీడియాలో ఉంచి వాట్సప్ ఇతర లింకులను పంపిస్తారు. ఆపై ఉద్యోగాలిప్పిస్తామంటూ నమ్మించి మోసం చేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో అయితే వ్యక్తులు ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతుండేవారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కడుంటారో తెలియదు కానీ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతూ భారీగా డబ్బులు దోచేస్తున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ అమాయకులను మోసం చేస్తున్న ఈ ముఠాలు ఒక్కొక్కరిని ఒక్కో రకంగా టార్గెట్ చేస్తున్నాయి. ప్రతి సంవ త్సరం డిగ్రీలు పూర్తి చేసుకుని బయటకు వచ్చేవారు ఉద్యోగాల వేటలో ఉంటారు. ఆ సమయంలో త్వరగా ఉద్యోగంలో చేరిపోవాలనే ఆలోచనతో రిజిస్ట్రేషన్ ఫీజే కదా అంటూ రూ.2వేలు ముందుగా చెల్లిస్తూ.. సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కిపోతున్నారు. ఉద్యోగం అంటే కష్టపడితేనే వస్తుందనే విషయాన్ని విస్మరించి అంతో ఇంతో డబ్బులు చెల్లించి ఉద్యోగం చేరిపోదామని భ్రమలో ఉండే వారు ఇలాంటి మోసాలకు గురవుతున్నారు. ఇలా ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో 19 నెలల్లోనే 70 మంది బాధితులు జిల్లా వ్యాప్తంగా ఉన్నారంటే ఇట్టే అర్థమవుతుంది.

జాగ్రత్తలు తీసుకోకపోతే..

ఉద్యోగం కోసం ప్రయత్నించేవారు సోషల్ యాప్స్‌పై ఆధార పడుతున్నారు. వివిధ జాబ్‌పోర్టల్స్‌లో తమ బయోడేటాను అప్‌లోడ్ చేస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పించే థర్డ్ పార్టీ కన్సల్టెన్సీలు చాలా వరకు ఉంటాయి. దీంతో ఉద్యోగికి, కంపెనీలకు మధ్యవర్తిగా ఉంటూ పలు కన్సల్టెన్సీలు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తూ.. వారు చేసిన ఈ సేవలకు ఆయా కంపెనీల నుంచి కమీషన్లు తీసుకుంటుంటారు. అయితే ఎవరు కూడా నేరుగా ఉద్యోగి నుంచి డబ్బులు తీసుకోరు. ఈ విషయంపై అవగాహన లేని వారు కొందరైతే, ఆశతో డబ్బులు చెల్లించే వారు మరికొందరు ఉంటున్నారు. ఇలా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, ఇతర దేశాల్లో ఉద్యోగాలంటూ అమాయకులను మోసం చేస్తున్న ముఠాలు నిరంతరం అమాయకులపై వల వేస్తుంటాయి. ఎప్పుడైతే ఉద్యోగం విషయంలో డబ్బు ప్రస్తావన వచ్చిందో అది తప్పనిసరిగా మోసం అయి ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలని సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లాలో మోసపోయిన బాధితులు

- కడపకు చెందిన ఓ యువకుడు బీటెక్ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో జాబ్ సెర్చింగ్ చేశాడు. ఒక కస్టమర్‌లా ఓ యువతి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కోసం అంటూ అతని అకౌంటులో నుంచి దాదాపు లక్షల్లో దండుకున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ప్రొద్దుటూరుకు చెందిన ఓ యువతి వర్క్‌ఫ్రం హోం ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో జాబ్ కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో సెక్యూరిటీ డిపాజిట్ అంటూ ఆమె దగ్గర లక్ష దండుకున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.
- గత ఏడాది బద్వేలు, పోరుమామిళ్ల, మైదుకూరు ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ కోసం వేలల్లో డబ్బులు చెల్లించారు. అయితే వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుని ఆ ఆన్‌లైన్ సంస్థ బోర్డు తిప్పేశారు. దీంతో బాధితులకు వారు అందుబాటులో లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఎన్నో జరిగాయి. దాదాపు 19 నెలల్లోనే ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసపోయి 70 మంది వరకు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. మరింత మంది మోసపోయి పోలీసుస్టేషన్ కూడా రాలేని వారు ఎంత మంది ఉంటారు. మరి ఆన్‌లైన్ మోసాలపై యువత అప్రమత్తంగా లేకుంటే సర్వం కోల్పోవాల్సి వస్తుంది.

ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీ

- ఆసుపత్రి వైద్యసిబ్బందితో కుమ్మక్కు
- సిబ్బందికి మందు, విందు, కమీషన్లతో ఎర
- అనుమతి లేకుండానే ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్
- రోగులను దోచుకుంటున్న అంబులెన్స్ మాఫియా

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 31: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రైవే టు అంబులెన్స్‌ల మాఫియాకు అడ్డాగా తయారయింది. వైద్య సిబ్బంది ప్రైవేటు అంబులెన్స్ వారితో కుమ్మక్కై రోగులను దోచుకుంటున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులు డిశ్చార్జ్ అయినప్పుడు ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేసినప్పుడు లేదా రోగి మరణించినా అంబులెన్స్‌లను ఆశ్రయిస్తారు. ఈసమయంలో రోగుల నిస్సహాయతను ఆసరా చేసుకుంటున్న ప్రైవేటు అంబులెన్స్‌ల వాళ్లు ఇష్టానుసారం బాడుగలు వసూలు వస్తూ రోగులను దోచుకుంటున్నారు. ఇక రోగులకు సహాయ సహకారం అందించాల్సిన వైద్య సిబ్బంది అంబులెన్స్ యజమానులు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి రోగుల జేబులకు చిల్లులు పడేలా వ్యవహరిస్తున్నారు.



ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేసిన అంబులెన్స్‌లు



బాడుగల ధరల పట్టికను తొలగించిన దృశ్యం

రుయా సంఘటనతో మార్పు

రెండేళ్ల క్రితం 2022లో తిరుపతి రుయాలో జరిగిన సంఘటన రాష్ట్రంలో పెను దుమారం రేపింది. కేవలం 75 కి.మీకే రూ.20వేలు డిమాండ్ చేసిన ప్రైవేటు అంబులెన్స్‌లు. దీంతో బాలుడి శవాన్ని స్కూటరు మీదనే తీసుకెళ్లాడు బాలుడి తండ్రి. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న అప్పటి ప్రభుత్వం ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులను తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ధరలను నిర్ణయించింది. ధరల పట్టికను ప్రతి ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు తెలిసేలా బ్యానర్లను కట్టించింది. ఈ సంఘటనతో ఆసుపత్రి అధికారులు ప్రత్యేక చొరవ చూపారు. కానీ నేడు అందుకు పూర్తి భిన్నంగా తయారైంది పరిస్థితి.

మందు, విందు, కమీషన్లతో ఎర

ప్రైవేటు అంబులెన్స్‌ల వారు తమకే రెఫర్ చేయాలంటూ ఆసుపత్రిలో పనిచేస్తున్న కొంతమంది వైద్యసిబ్బందికి మందు, విందుతో పాటు 10 నుంచి 20 శాతం కమిషన్లు ఇస్తున్నారు. దీంతో వారు రోగులకు తమకు అనుకూల అంబులెన్స్ డ్రైవర్ల నెంబర్లు ఇస్తున్నారు. రోగులతో బేరం కుదిరాక అందులో నుంచి వైద్యసిబ్బందికి వెంటనే కమిషన్లు ఇస్తున్నారు. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌ల వాళ్లు ఇష్టం వచ్చినట్లు బాడుగలు వసూలు చేస్తూ.. రోగులను దోచుకుంటున్నారు. ఇక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆవరణలో ప్రైవేటు అంబులెన్స్‌ల బాడుగలకు సంబంధించి ఏర్పాటు చేసిన ధరల పట్టికను తొలగించి వేశారు. దీంతో రోగుల బంధువులు బాడుగల విషయంలో అవగా హన లేక వాళ్లు ఎంత చెబితే అంత బాడుగ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రైవేటు అంబులెన్స్‌ల పార్కింగ్‌కు అడ్డాగా...

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ప్రైవేటు అంబులెన్స్‌ల పార్కింగ్‌కు అడ్డాగా మలుచుకున్నారు. సాధారణంగా అంబులెన్స్‌లు ఆసుపత్రి బయట ఉండాలి. కానీ కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రైవేటు అంబులెన్స్‌లు యథేచ్ఛగా ఆసుపత్రి ఆవరణలో, లోపల యథేచ్ఛగా పార్కింగ్ చేస్తారు. ఇందుకు ప్రధానంగా వైద్యసిబ్బందే కారణం అని చెప్పవచ్చు. అంబులెన్స్ వారు మందు, కమిషన్ ఇచ్చి సిబ్బందిని తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నారు.

వారిలో వారికే.. కుమ్ములాటలు

ప్రైవేటు అంబులెన్స్‌ల యజమానులు వైద్యసిబ్బందికి కమిషన్లను ఇచ్చి... వారి ఇష్టం వచ్చినట్లు బాడుగలు తీసుకుంటూ రోగులను దోచుకుంటున్నారు. అయితే ఈ విషయంలో వారిలో వారికే కుమ్ములాటలు మొదలయ్యాయి. ఒకే వ్యక్తికి సంబంధించి అయిదు నుంచి ఆరు అంబులెన్స్‌లు ఉండడం, అతను వైద్యసిబ్బంది అవసరాలు తీర్చి కమిషన్లు అధికంగా ఇవ్వడంతో బాడుగలన్నీ అతనికే చెబుతున్నారు. దీంతో మిగిలిన అంబులెన్స్‌ల వారికి బాడుగలు లేక అసహనానికి గురవుతున్నారు. దీంతో వాళ్లు తమ వాహనాలకు బాడుగలు లేక ఈఎంఐలు కట్టలేక, ఇళ్లు గడవక వారిలో వారే గొడవలు పడుతున్న సంఘటనలున్నాయి.

ధరల పట్టిక మళ్లీ ఏర్పాటు చేస్తాం



అంబులెన్స్‌ల బాడుగలకు సంబంధించి ధరల పట్టికను ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేశాం. అది పాడైపోవడంతో కొత్తది ఏర్పాటు చేస్తాం. అంబులెన్స్‌లు ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేయకుండా చేస్తాం. కొందరు వైద్య సిబ్బంది కమీషన్లు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ఫిర్యాదు అందితే సిబ్బందిపై చర్య లు తీసుకుంటాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ సర్వజన ఆసుపత్రి, కడప

షార్ ఉద్యోగి మృతికి ఎమ్మెల్యే సంతాపం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి

చిట్వేలి, జూలై 31: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షార్ ఉద్యోగి నరేంద్ర(39) మృతదేహం బుధవారం ఆయన స్వస్థలమైన చిట్వేలి మండలం వెంకటరాజుపల్లెకు తీసుకురావడంతో బుధవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్ రెడ్డి, కూటమి నేతలు నరేంద్ర తదితరులు సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ సంతాపం వ్యక్తం చేశారు. సహ ఉద్యోగి పదవీ విరమణ సందర్భంగా గిఫ్ట్ తీసుకోవడానికి సూళ్లూరుపేట వెళ్లిన ఆయన పిండిపాలెం క్రాస్‌వద్ద మంగళవారం మధ్యా హ్నం సమయంలో ద్విచక్ర వాహనంపై లారీని ఢీకొన్న ఘటనలో నరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అతని జేబులో ఉన్న ఆధార్‌కార్డు, లైసెన్సు ఆధారంగా పోలీసులు అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం వెంకటరాజుపల్లె వాసిగా గుర్తించి వివరాలు తెలిపారన్నారు.

మోటర్ల వైరు చోరీ

కొండాపురం, జూలై 31: మండలంలోని పొట్టిపాడు సమీపంలోని చిత్రావతి నదిలో బాలాంజనేయులు అనే రైతుతో పాటు మరో ఐదుగురికి చెందిన మోటర్ల నుంచి స్టార్టర్లకు వెళ్లే వైరు బుధవారం రాత్రి చోరీకి గురైంది. గురువారం ఉదయం మోటర్లు ఆన్ చేయడానికి వెళ్లినపుడు చోరీ విషయం గుర్తించినట్లు వారు తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు తీవ్రగాయాలు



విద్యార్థులను పరామర్శిస్తున్న బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు, జూలై 31: పాఠశాల ఆవరణలో నిలువ ఉంచిన విద్యుత్ స్తంభాల వద్ద ఆడుకుంటుండగా అవి దొర్లి పడడంతో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. 24 గంటల విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో భాగంగా విద్యుత్ అధికారులు మండలంలోని కామసముద్రం ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్తంభాలను నిలువ చేశారు. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు వాటిపైకి ఎక్కడంతో అవి దొర్లిపడ్డాయి. దీంతో స్రవంతి (10) కాలు విరగగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో అట్లూరు ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో విద్యార్థులను రిమ్స్‌కు తరలించారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ రిమ్స్‌కు వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. పిల్లల తల్లిదండ్రులు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బద్వేలుటౌన్, జులై 31: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ చాపర్ల వెంకటయ్య (47) బుధవారం మృతి చెందారు. మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య వెంకట కళ్యాణి, కూతురు నవ్యశ్రీ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి

మైదుకూరు రూరల్ జూలై 31 : బుర్రకథ, జానపద కళల్లో రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత బండారు ఆంజనేయులు గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మైదుకూరు మండలంలోని ఉత్సలవరం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఎన్‌టీఆర్ అభిమాని. గండికోట ఉత్సవాలు, ఉగాది పురస్కారాలు, కృష్ణా పుష్కరాలు, పిచ్చిగుంట్ల కళోత్సవాల్లో పలు అవార్డులను సొంతం చేసుకొన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆంజనేయులు మృతి కళామతల్లికే కాకుండా టీడీపీకి కూడా తీరని లోటు అని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపి, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

లారీ డ్రైవరుకు జైలు శిక్ష

సికెదిన్నె, జూలై 31: మద్యం సేవించి వాహనం నడిపినందుకు విజయ్‌చంద్రన్ అనే వ్యక్తికి పది రోజులు జైలు శిక్ష విధించినట్లు సికె దిన్నె ఎస్ఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఈ నెల 30న మద్యం సేవించి లారీ నడుపుతుండగా ఎంవీఐ విజయభాస్కర్ బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయడంతో పట్టుబడ్డాడు. అతనిని పోలీసులకు అప్పగించగా, నిందితుడికి పది రోజులు జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు నిచ్చినట్లు ఆయన వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సిద్దవటం, జూలై 31: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి 10 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ నాగరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా నేరమన్నారు. ఎస్.రాజంపేట, సిద్దవటం, గాండ్లపాలెం, కమ్మపాలెం, దర్జీపల్లె, పెన్నానది పరివాహ ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా స్పెషల్ టీం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తల్లిపాలు పిల్లలకు పౌష్టికాహారం : జేసీ

రాయచోటి(కలెక్టరేట్), జూలై 31: పుట్టిన పిల్లలకు తల్లి పాలు పౌష్టికాహారం అని జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లో తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం అనే పోస్టర్‌ను తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. బిడ్డ జన్మించిన మొదటి గంటలోపు తల్లి పాలు అమృతం లాంటివని, వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు అందుతాయని తెలిపారు. పుట్టిన పిల్లలకు సంపూర్ణపోషణ, మానసిక వికాసం తల్లి పాలతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కొండయ్య, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న జేసీ, సబ్‌కలెక్టర్లు

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జాయింట్ కలెక్టర్, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్‌లు ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్ సర్టిఫికెట్లు అందించారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ బాధ్యతలో భాగంగా అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థులకు అధిక మార్కులు సాధించినందుకు.. ఒక్కొక్కరికి రూ.15 వేలు స్కాలర్‌షిప్ వారి బ్యాంక్ ఖాతలో జమ చేసినటు సీఏజీఎల్ సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం కలిగి ఉండాలి: సబ్ కలెక్టర్

రాజంపేటటౌన్, జూలై 31: విద్యార్థులు పోటీ తత్వం కలిగి ఉండాలని సబ్‌కలెక్టర్ వైకోమ్ నిదియాదేవి సూచించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రముఖ హిందీ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా హిందీ వ్యాసరచన పోటీ విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ ఆధ్వర్యంలో జూలై 28వ తేదీన ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ ఏ పోటీలు జరిగినా అందులో పాల్గొనడం విద్యార్థులకు ఉండాల్సిన ముఖ్య లక్షణం అన్నారు. హిందీ వ్యాసరచనలో మొదటి బహుమతి ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భరణి, ద్వితీయ బహుమతి బీవీఎస్ విద్యార్థిని సాదియా, తృతీయ బహుమతి మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతిక అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్, హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, రాజశేఖర్, అల్లాబకస్‌లు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ నిధియాదేవి చేతులమీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మీ సేవలు చిరస్మరణీయం

- అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్



పదవీ విరమణ సన్మానం అందుకుంటున్న కొండారెడ్డి, సీవీ రమణ

కడప (క్రైం), జూలై 31 : దాదాపు 35 ఏళ్ల పాటు అంకితభావంతో పోలీసు శాఖకు అందించిన సేవలు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మినీ కాన్ఫరెన్స్ హాలులో జూలై 31న పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఆయన ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి, నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ ఏవో జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్, వైవీయూ వీసీల భేటీ



చర్చించుకుంటున్న వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల వైస్‌చాన్సలర్‌లు

కడప (ఎడ్యుకేషన్), జూలై 31 : వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథ కుమార్ బేటీ అయ్యారు. బుధవారం ప్రొఫెసరు విశ్వనాథకుమార్ తొలిసారిగా వైవీయూను సందర్శించారు. ఇరువురు వీసీలు కలిసి విశ్వవిద్యాలయ అభివృద్ధిపై చర్చించారు. యూనివర్సిటీ ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం

కడప (ఎడ్యుకేషన్), జూలై 31 : యూనివర్సిటీల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడడానికి ప్రథమ ప్రాధాన్యమిస్తామని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కృష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థుల సమస్యలపై చర్చించేందుకు వసతిగృహాల చీఫ్ వార్డెన్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సాయంత్రం యూనివర్సిటీ నుంచి గురుకులంలోకి బస్సులను నడపాలని జూనియర్ హాస్టల్స్‌కు వెళ్లే సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా విద్యార్థులు కోరారు. క్రీడలపై చర్చించారు. అందుకు వీసీ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు.

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కడప(కలెక్టరేట్) జూలై 31: పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి చేరిన యువకుల మృతదేహాలను వైద్యులు , సిబ్బంది ఇష్టానుసారంగా కోశారని, సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరుకు చెందిన టీడీపీ నేత మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముక్తియార్ బుధవారం కలెక్టర్ శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డ్యాంలో మునిగి చనిపోయిన ఆ యువకులు పేద కుటుంబాలకు చెందిన వారని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని కోరామన్నారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే వారితో అగౌరవంగా వ్యవహరించడం తగదని, సేవాభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. పోస్టుమార్టంలో కూడా బంధువులు, కుటుంబ సభ్యులు బాధ పడేలా శవాలను కోయడం బాధ కల్గించిందని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనీ కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

హాస్టల్‌లో సౌకర్యాలపై జడ్జి ఆగ్రహం

రాయచోటిటౌన్, జూలై 31: పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల హాస్టల్‌లో సౌకర్యాలపై జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆయన వంట గదిని, అక్కడున్న కూరగాయలు, సరుకులు పరిశీలించారు. కూరలు రుచి చూశారు. తాగునీటి సరఫరా సరిగ్గా లేదని విద్యార్థులు జడ్జికి ఫిర్యాదు చేశారు. హాస్టల్ పరిశుభ్రంగా లేదని వార్డెన్‌ను హెచ్చరించారు. హాస్టల్‌లో నెలకొని ఉన్న సమస్యలను అధికారులతో చర్చించి మంచినీటి వసతిని కల్పిస్తానని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధన మేరకు పిల్లలకు మంచి భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. మళ్లీ నేను హాస్టల్ విజిట్‌కు వచ్చేటప్పటికీ హాస్టల్‌లో మార్పులు ఉండాలని, మంచి వసతులతో ఉండాలని వార్డెన్‌కు సూచించారు.

విద్యార్థులున్నారంటే రైట్.. రైట్..

- బస్సు ఆపకుండా వెళ్లిన ఆర్టీసీ డ్రైవరు
- వాగ్వాదంతో ఆగిన ట్రాఫిక్

ఖాజీపేట, జూలై 31: బస్సులు ఆపకపోవడంతో, గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నా మని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. ఖాజీపేట మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో దాదాపు 300 మంది బస్సు ప్రయాణం చేసే విద్యార్థులు ఉన్నారు. టార్గెట్ అందదన్న ఉద్దేశంతో ఆర్టీసీ సిబ్బంది విద్యార్థులు వేచి చూసే బస్టాపుల్లో బస్సులు నిలపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో చాలా సార్లు ఫస్ట్ పీరియడ్ కూడా అయిపోతోందని, సాయంత్రం వేళల్లో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, తమను బస్‌స్టాపులో చూడగానే బస్సును మరింత వేగంగా నడుపుతూ వెళ్లిపోతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ బస్సును ఎక్కినా తమను చులకనగా చూస్తున్నారని అంటున్నారు. కాగా, బుధవారం ఆగకుండా వెళుతున్న బస్సుకు స్కూలు అటెండర్ అటెండర్ అడ్డుగా వెళ్లి ఆపాడు. దీంతో డ్రైవర్ అటెండర్‌తోపాటు విద్యార్థులతో వాగ్వాదానికి దిగాడు. ఫలితంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురికి నచ్చజెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని విద్యార్థుల కోసం బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



వాగ్వాదం చేస్తున్న డ్రైవర్

ఉపాధ్యాయులు చెప్పిన రీతిలో విద్యార్థులు చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వల్లూరు, జూలై 31 :విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన రీతిలో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవో విజయారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీరు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఎప్పుడైతే విద్యార్థులు తమ ఉపాధ్యాయులు చెప్పిన బోధనా పద్ధతిలో చదువుతారో వారు ఉన్నత శిఖరాలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే చదువుతో పాటు వారు ఎంచుకున్న క్రీడలను ఎంచుకుంటే మానసికంగా ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఆదర్శపాఠశాల ఆహ్లాదకరంగా ఉంటుందని, ఇక్కడ చదువుకున్న వారు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

సేంద్రియ జీవన ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నందిపల్లెలో రైతులకు సేంద్రియ విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వేంపల్లె, జూలై 31: సేంద్రియ జీవన ఎరువులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట ఉత్పత్తులను పొందాలని నవభారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి రైతులకు తెలిపారు. మండలంలోని నందిపల్లె, కత్తలూరు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సేంద్రియ జీవన ఎరువుల గురించి తెలిపారు. రసాయన ఎరువుల వల్ల భూమి విషతుల్యమవుతోందని రైతులు సేంద్రియ విధానంపై మొగ్గుచూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కృష్ణమూర్తి, సురేష్, గంగాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల, జూలై 31: మండలంలోని దొండ్లవాగు, తేర్నాంపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నకుడాల ఫీడర్ మెయింటెనెన్స్ కారణంగా ఆయా సబ్‌స్టేషన్లపరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఉంటుందని, రైతులు సహకరించాలని కోరారు.

ఉత్తమ సమాజం కోసం పాటుపడిన వ్యక్తి జంపా కృష్ణకిషోర్

పులివెందుల రూరల్,జూలై 31: ఉత్తమ పౌర సమాజం కోసం వందలాది చైతన్య, అవగాహన సదస్సులు నిర్వహించిన వ్యక్తి జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ అని ప్రధానోపాధ్యాయుడు బండి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇస్లాంపురంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో జంపా కృష్ణకిషోర్ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవయవదాత, శరీర దాత, సమాజశ్రేయస్సు కోసం అహర్నిశలు పరితపించే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా, ఉపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, యూనస్, ప్రహ్లాద, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండాలకు రోడ్ల సౌకర్యం కల్పించాలి

కడప (మారుతీనగర్), జూలై 31: జిల్లాలోని మారుమూల తాండాలకు రోడ్ల సౌకర్యం కల్పించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐటీఐ సర్కిల్ సమీపంలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన తాండాలలో నేటికీ రోడ్లు, మంచి నీరు లేక తాండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రభుత్వ బాలుర వసతి గృహాల తాలూకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అలాగే మైదాన ప్రాంతాలలో నివశిస్తున్న గిరిజనులకు న్యాయం జరిగేలా చేయాలన్నారు నాయకులు చంటి, ప్రసన్న పాల్గొన్నారు.

భైరవస్వామిని దర్శించుకున్న శశిభూషణ్‌రెడ్డి



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, తదితరులు

పెండ్లిమర్రి, జూలై 31: మండంలోని కోరవాండ్లపల్లె సమీపంలో వెలసిన భైరవస్వామిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. అతి పురాతనమైన ఆలయం కావడంతో భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈ నేపథ్యంలో శశిభూషణ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. బీజేపీ ప్రధానజనరల్ సెక్రటరీ హరిప్రసాద్, ఎస్సీ మోర్చా శ్రీరాములు, పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్ కృష్ణ పాల్గొన్నారు.

'డొక్కా సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయం'



మాట్లాడుతున్న గోపాలకృష్ణశర్మ

కడప (కల్చరల్), జూలై 31: ఎన్డీఏ ప్రభుత్వం మధ్యాహ్న బడి భోజనం పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయమని అర్చక పురోహిత సంఘం జిలా అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణశర్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆకులవీధిలో గల రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో గోరుముద్దగా ఉన్న పేరును తొలగింపచేసి అపర అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన డొక్కాసీతమ్మ పేరుతో మార్పు చేయడం హర్షణీయమన్నారు.

'హామీల అమలుపై దృష్టి సారించండి'

కడప (మారుతీనగర్), జూలై 31: ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలని సంఘ సేవకుడు సలావుద్దీన్ కోరారు. బుధవారం స్థానిక చిలకలబావి వీధి వద్ద గల ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హామీలు అమలు చేయ కుంటే ఆందోళన చేపడతామన్నారు.

లవణశాతం అధికమైనందునే..

● ఎండిపోయిన వరి నాట్లను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



ఎండిపోయిన వరి నారును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం రూరల్, జూలై 31 : లవణాల శాతం ఎక్కువగా ఉండడం వల్లనే వరి ఎండిపోయిందని ఊటుకూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మీరాపురం, పుట్లంపల్లె, సంబటూరు గ్రామాల్లో వరి పొలాలను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, డాక్టర్‌లు ఎం.శ్రీనివాస చారి, డాక్టర్ సునీల్, మాధవీ, కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, కమలాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి మండల వ్యవసాయ అధికారి సరస్వతిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సందర్శించిన గ్రామాల్లో వరి నారుమళ్లు, ప్రధాన పొలాల్లో రైతులు కేఎన్ఎం 1638, 733 రకాలను సాగు చేశారు. అన్ని పొలాల్లో వరి నాటిన 3 రోజుల నుంచి పూర్తిగా ఎండిపోయిందని, అందులో ప్రధానంగా మూడు లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. దీనికి గల కారణాల కోసం వరి పొలాల నుంచి నీరు, మట్టిని సేకరించామన్నారు. ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో వీటిని విశ్లేషించగా లవణ శాతం 3 నుంచి 10, డీఎస్ఎం1గా ఉన్నాయన్నారు. సాధారణంగా లవణ శాతం 2 కంటే తక్కువ ఉన్నప్పుడు మాత్రమే మొక్కల్లో సాధారణ పెరుగుదల ఉంటుందన్నారు. దీని నివారణకు గాను పాలిఫిడ్ (19.19.19) 5 గ్రాములు, 0.2 గ్రాములు చిలేటెడ్ జింక్ సల్ఫేట్ కలిపి నాటిన 3 రోజుల నుంచి పిచికారీ చేయాలన్నారు. అలాగే సంబటూరు గ్రామంలో పూత దశలో ఉన్న మినుము పంటను కూడా వారు సందర్శించారు.

మినుములో ఆకుముడత లక్షణాలను గుర్తించి దీని నివారణకు డైఫన్ దయురాన్ 1.25 గ్రాములు, 13.0.45ను 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, రైతు సంఘం నాయకులు ప్రభాకరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో మొక్కలు నాటాలి

సీకేదిన్నె, జూలై 31: ప్రతి ఒక్కరు తమ తల్లిపేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జె.కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ తల్లిపేరిట బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాల్లో, మండలాల్లో తల్లిపేరుతో మొక్కలు నాటి వాటిని సంరక్షించి కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. చెట్లు మన ప్రగతికి మెట్లు అని, నేటి మొక్కలే రేపటి వృక్షాలని, చెట్లు మనకు అవసరమైన ఆక్సిజన్ కూడా అందిస్తాయన్నారు. చెట్టులోని ప్రతి భాగం మానవుల అవసరాలు తీర్చుతుందని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను అడిగి వారి సమస్యలు, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి నిధులు రాక ఆగిపోయిన పాఠశాల పనులను ఉన్నతాధికారులతో చర్చించి త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వి. క్రిష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, సుబ్బనరసయ్య, దర్బార్‌బాష, హబీబ్, రెడ్డిబాష, జబివుల్లా, నారాయణ పాల్గొన్నారు.

రేపు కేసీ కెనాల్‌కు నీటి విడుదల

మైదుకూరు రూరల్ జూలై 31 : రాజోలీ జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు,చాపాడు స్లూయిస్ ఎత్తి నీటిని విడుదల చేయనున్నారని ఆయన పీఏ ఆది తెలిపారు. కేసీ ఆయకట్టు కింద పంటలు పండించుకొనే రైతులు నీటి విడుదల వార్తలో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా కేసీ ఆయకట్టు కింద సుమారు 92 వేల ఎకరాలలో రైతులు పంటలు సాగు చేయనున్నారు. వారందరిలో ఆనందం వ్యక్తమవుతోంది.

ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం

చెన్నూరు, జూలై 31 : చెన్నూరు కొత్తరోడ్డు వద్ద గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న జలగాళ్ల చిన్నక్క (50)అనే మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి ఒకటిన్నరన కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నారాయణయాదవ్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల మండల వ్యాప్తంగా గంజాయి అమ్మకాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టిన నేపధ్యంలో చెన్నూరు కొత్తరోడ్డులోని శివారెడ్డి చిల్లర అంగడి వద్ద గంజాయి అమ్మేందుకు సిద్దంగా ఓ మహిళ ఉందని అందిన సమాచారంతో సీఐ తన సిబ్బందితో దాడి చేసి పటుకున్నారు. ఈమె నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిళం గ్రామం, ఇందిరమ్మకాలనీకి చెందిన మహిళ అని తెలిపారు. అంతేకాక ఇటీవల రాజంపేట బైపాస్‌రోడ్డులోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాలు వెనుక పక్క దొమ్మర పుల్లయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 3.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారని, అదే వ్యక్తికి బుధవారం అరెస్టు అయిన జలగాళ్ల చిన్నక్క గంజాయి అమ్మేందుకు తీసుకురావడంతో పక్కాగా అందిన సమాచారంతో దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని ఆ మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆ మహిళను కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

ఆర్డీగా డాక్టర్ శ్రీనివాసులు



కడప (సెవెన్‌రోడ్స్), జూలై 31 :వైద్య, ఆరోగ్యశాఖ జోన్ 4కు సంబంధించి రీజనల్ డైరెక్టరుగా ఇన్‌చార్జ్ బాధ్యతలను కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ శ్రీనివాసులుకు అప్పగించారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం డాక్టర్ శ్రీనివాసులు రీజనల్ డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన సుంకర

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 31 :విజయవాడలోని సీఎంవో కార్యాలయంలో బుధవారం ప్రిన్సిపల్ సెక్రటరీ మద్దాల రవిచంద్రను జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కో ఆర్డినేటర్, కడప నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సమకాలీన విషయాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాకార్యనిర్వాహక కార్యదర్శి అజయ్ వర్మ మరియు పర్సనల్ అసిస్టెంట్ ఆలీ పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహితులకు తోడ్పాటు



నియామక పత్రాలను అందుకుంటున్న శ్రీధర్‌శర్మ

కడప (కల్చరల్), జూలై 31: జిల్లాలోని బ్రాహ్మణ పురోహితులకు తోడ్పడతామని ఏపీ బ్రాహ్మణ పురోహిత సమాఖ్య జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపికైన మూర్తిరాజు సత్యనారాయణశర్మ, వారణాసి శ్రీధర్ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖపట్నం శిల్పారామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహిత సమాఖ్య రాష్ట్ర, జిల్లాల నూతన కమిటీల నియామకాలు జరిగాయి. ఇందులో కడప జిల్లా బాధ్యులుగా ఆ ఇరువురిని నిర్వాహకులు ఏకగ్రీవంగా ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పురోహితత్వం బ్రాహ్మణుల కులవృత్తిగా గుర్తించేలా తమవంతు శ్రమిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

చెన్నూరు, జూలై 31 : మండలంలోని చిన్నమాచుపల్లె సమీపంలో హైవే రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నూరు బుడ్డాయపల్లెకు చెందిన మిట్ట కేశవరెడ్డి (45) ఆయన భార్య సంధ్య (40) గాయాలపాలయ్యారు. బుడ్డాయపల్లెకు చెందిన ఈ దంపతులు ద్విచక్ర వాహనంపై కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా చిన్న మాచుపల్లె వద్ద హైవే రహదారిపై వారి వెనుకనే ఖాజీపేట వెళుతున్న కారు ఢీకొనడంతో గాయాలపాలయ్యారు.చికిత్స నిమిత్తం వారిని స్థానికులు కడపకు తరలించారు.

నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

సింహాద్రిపురం, జూలై 31: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 1వ తేదీ గురువారం ఎన్టీఆర్ భరోసా పంఛన్ల పంపిణీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీఈడీఓ సాల్మన్ రాజ్ తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా 5457 మంది పింఛను లబ్ధిదారులకు గాను రూ. 2.27 కోట్లు చెల్లించేలా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. లబ్ధిదారులు గురువారం ఉదయం 6 గంటల నుంచి తమ ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ కోరారు.

గండిని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

చక్రాయపేట, జూలై 31: గండి క్షేత్రాన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. బుధవారం గండి క్షేత్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ పుణ్యస్థలిని దేశంలోనే గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలని కోరారు.

జ్వరపీడితులందరికీ రక్తపరీక్ష చేయాలి

వేముల, జూలై 31: జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తపరీక్ష చేయాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ సిబ్బందికి సూచించారు. మండలంలోని చాగలేరు గ్రామంలో ప్రజలకు దోమల వలన వచ్చే ప్రాణాంతక వ్యాధులను వివరించారు. దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియ, బోధకాలు,ఫైలేరియ, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమలు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలు వివరించారు, డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆఫ్రిన్, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, సీహెచ్‌ఓ రెడ్డమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెస్ బిల్లులు తగ్గించాలి



వైస్‌చాన్సలర్‌తో మాట్లాడుతున్న విద్యార్థులు, ఆర్వీఎస్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 31: విద్యార్థులు తిన్నా తినకపోయనా మెస్ బిల్లులు అధికంగా వేస్తున్నారని, వాటిని తగ్గించాలని ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీశ్ డిమాండ్ చేశారు. బుధవారం వైవీ యూలో ఆర్వీఎస్ ఆధ్వర్యంలో వైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆర్నెల్ల నుంచి విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతన్నా యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. విద్యార్థులు కలుషిత ఆహారం తినలేక ఇళ్లకు వెళ్లి నెలల తరబడి ఉండి వచ్చినా వారి నుంచి మెస్ బిల్లులు రాబట్టి అధికారులు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. తక్షణం ఉన్నతాధి కారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో వైవీయూ విద్యార్థులు పాల్గొన్నారు.

వలసలు లేని రాయలసీమ కోసం ఉక్కు పరిశ్రమ నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ ప్రతినిధులు

పులివెందుల టౌన్, జూలై 31: వలసలు లేని రాయలసీమ కోసం ఉక్కు పరిశ్రమను నిర్మించాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం పులివెందుల ఆర్డీఓ వెంకటేశులుకు వినతిపత్రం సమర్పించారు. శంకర్ మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాల్సి ఉందన్నారు. 2014లో ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోదీ హామీ కూడా ఇచ్చారన్నారు. పదేళ్లు దాటినప్పటికి కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఉక్కు కర్మాగారంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఉక్కు కర్మాగారంకోసం టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు కూడా పోరాటం దిశగా అడుగులు వేయకపోవడం దారుణమన్నారు. ఉక్కు పరిశ్రమ వల్ల కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమ నెలకొల్పాలనే డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పీఆర్ఎస్‌వైఎఫ్ ప్రతినిధులు నాగేంద్రబాబు, తరుణ్, రవితేజ, విష్ణు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్‌ను రద్దుచేయాలి

● యూనివర్సిటీలకు సెట్‌లు నిర్వహించే స్వేచ్ఛ ఇవ్వాలి: ఆర్వీఎస్



వైవీయూలో నిరసన తెలుపుతున్న ఆర్వీఎస్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 31 : ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేసి యూనివర్సిటీలకు టెట్‌లు నిర్వహించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీశ్ డిమాండ్ చేశారు. బుధవారం వైవీయూలో ఆర్వీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత పీజీ ప్రవేశ పరీక్ష ద్వారా విద్యాసంవత్సరం సరైన సమయానికి ప్రారంభమై నిర్ణీత కాలంలో ముగియడం లేదన్నారు. సకాలంలో విద్యాసంవత్సరం ప్రారంభం కాని కారణంగా పీజీ స్థాయిలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంటు నెంబరు భారీగా తగ్గిందన్నారు. పేద గ్రామీణ విద్యార్థులకు ఇంటర్, సాంకేతిక సదుపాయాలు లేనందున ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో పీజీ సెట్‌కు సంబంధించిన సమాచారం కూడా గ్రామీణ ప్రాంతాలకు చేరడంలేదన్నారు. యూజీ డిగ్రీకి సంబంధించిన పరీక్ష ల ఫలాలను వివిధ యూనివర్సిటీలు వభిన్న సమయాల్లో ప్రకటిస్తున్నాయని తెలిపారు. దీని వల్ల పీజీ సెట్‌కు సంబంధించిన కౌన్సెలింగ్ కూడా ఆలస్యమవుతోందన్నారు. అన్ని కోర్సులను అన్నివిశ్వవిద్యయలాలు నడపవని, కొన్ని కోర్సులకు ప్రత్యేక అధ్యయనాలకు సంబంధించిన స్పెషలైజేషన్ బోధించే అధ్యాపకులను కొన్ని యూనివర్సిటీలు మాత్రమే ఉంటారన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ వెంటనే దీనిపై స్పందించి ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేయాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్వీఎస్ నాయకులు దిలీప్, భార్గవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

2021 నుండి టోకెన్ నెంబర్లను పునఃసమీక్షించాలి: ఎస్టీయూ



డీడీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 31 :టోకెన్ నెంబర్లను 2021 నుంచి పునః సమీక్షించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఇలియాస్‌బాషా, సంఘమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఖజానా కార్యాలయంలో డీడీ వెంకటేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప, పులివెందుల మండలాల ఎంఈఓల పరిధిలోని ఏ ఒక్క ఉపాధ్యాయుడికి కూడా 2018 జూలై 2019 జనవరి డీఏ అరియర్స్ బిల్లు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం బిల్లు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీడీ స్పందిస్తూ రాష్ట్ర ఖజానా శాఖ అధికారులతో మాట్లాడి డీఏ అరియర్స్ బిల్లు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సభ్యులు జయప్రద పాల్గొన్నారు.

వంతెన నాణ్యతను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు



అలిరెడ్డిపల్లె హైలెవెల్ వంతెనను పరిశీలించిన క్వాలిటీ ఈఈ సూర్యచంద్రారెడ్డి తదితరులు

వేంపల్లె, జూలై 31: వేంపల్లె పట్టణ సమీపంలోని పాపాఘ్ని నదిలో అలిరెడ్డిపల్లెకు నిర్మించిన హైలెవెల్ వంతెన నిర్మాణ నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ ఈఈ సూర్య చంద్రారెడ్డి తనిఖీ చేశారు. బుధవారం రూ.32.96 కోట్లతో నిర్మించిన వంతెనను విజిలెన్స్ అధికారుల బృందం పరిశీలించింది. ఇసుక లారీలను వంతెనపై నుంచి పోనిచ్చి నాణ్యతను పరీక్షించారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న హైలెవెల్ వంతెన ఎట్టకేలకు పూర్తయింది. డీఈలు గురివిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏఈలో గణేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, నాగేంద్ర, మునిరెడ్డి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పండితుల పదోన్నతి తేదీ కామన్‌గా ఉండాలి: యూటీఎఫ్



ఏడీకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 31:ఉన్నతీకరణలో భాగంగా భాషోపాధ్యాయులైన తెలుగు, హిందీ ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొంది భిన్న రకాలైన తేదీల్లో జాయిన్ అయినట్లుగా నమోదు చేసుకున్నారని, దీన్ని సవరించి అందరికీ ఒకే తేది కామన్‌గా ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం డీఈవో కార్యాలయంలో ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 నవంబరు 1 నుంచి 4 వరకు భాషోపాధ్యాయులకు ఉన్నతీకరణ, పదోన్నతులు కల్పించారని, అయితే పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు నవంబరు 1 నుంచి 4 వరకు వివిధ తేదీల్లో చేరడం వల్ల బదిలీల సమయంలోనూ, పదోన్నతుల్లోనూ కొంత మేర స్పష్టత కొరవడి సీనియారిటీ విషయంలో ఇబ్బందులకు గురవతున్నారన్నారు.

ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి పరిశీలించి కామన్ సీనియారిటీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు రవికుమార్, ఎజాజ్ అహ్మద్, చంద్రశేఖర్, గోపినాథ్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిష్ణారెడ్డి పదవీ విరమణ



క్రిష్ణారెడ్డి చేతికి బంగారు బ్రాస్‌లెట్ తొడుగుతున్న దృశ్యం

కడప (మారుతీనగర్), జూలై 31: ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా (ఎఫ్) పనిచేస్తున్న కన్నయ్యగారి క్రిష్ణారెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్థానిక మారుతీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విరమణ వేడుక ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తోటి ఆర్టీసీ వర్క్‌షాపు ఉద్యోగులు అంకిరెడ్డి, ఆంజనేయులుతో పాటు బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసులు (టైలర్) ఉద్యోగులు హాజరై క్రిష్ణారెడ్డి దంపతులను సత్కరించారు.

డ్రోన్ స్ప్రేయర్‌పై అవగాహన

వేముల, జూలై 31: మండలంలోని పలు రైతులకు డ్రోన్ స్ప్రేయర్‌పై రైతులకు అవగాహన కల్పించినట్లు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్య తెలిపారు. బుధవారం నాబార్డ్ సహకారంతో సుస్థిర వ్యవసాయ కేంద్రం మరియు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పత్తిపంటలో వచ్చే పురుగు తెగుళ్ల నివారణకు రైతు ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని ఆరు మంది రైతులకు ఉచితంగా బయోఫర్టిలైజర్ ఇచ్చి మూడు ఎకరాలు డ్రోన్ స్ప్రేయర్‌ను ఉపయోగించి పిచికారీ చేయించడం జరిగిందన్నారు. డ్రోన్ స్ప్రేయర్ వలన ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఏ స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, పీఓ రమణ, కిసాన్ మిత్ర భాస్కర్, శివార్జున్‌రెడ్డి, అశోక్, వికాస్, రైతులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆవులు ... ఇబ్బందుల్లో వాహనచోదకులు



జమ్మలమడుగు, జూలై 31: జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండు నుంచి తాడిపత్రి, హైదరాబాదు వెళ్లే ప్రధాన రోడ్డుపైనే ఆవులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. రోడ్డుపై వాహనదారులు వెళ్లాలన్నా ఆవులు రోడ్డుపై నిలిచి కదలడంలేదు. దీంతో వాహనదారులు బస్సును నిలిపి ఆవులను రోడ్డుపై నుంచి పక్కకు తరమాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆవుల యజమానులకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకునేందుకు నోటీసులు ఇవ్వాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే ప్రధాన రోడ్డుపైనే ఆవులు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆ మైదానం.. అసాంఘికాలకు అడ్డా

- నిరుపయోగంగా మారిన నిర్మాణాలు



క్రీడలకు అడ్డంగా పిల్లర్స్

పీఆర్ హైస్కూలు మైదానంలో ఆగిపోయిన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



నిరుపయోగంగా మారిన షటిల్ షెడ్డు

జమ్మలమడుగు, జూలై 31: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్థలాన్ని పతంగేరామన్నరావు దానం చేయడంతో ఆయన పేరుపై ఆ పాఠశాల నడుస్తోంది. అయితే పది సంవత్సరాల క్రితం పాఠశాల మైదానంలో ఒకవైపు సబ్‌స్టేషన్ నిర్మించేందుకు గోడలు నిర్మించి పనులు కొంతవరకు జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ఆగిపోయిన చోట మందుబాబులకు నిలయంగా మారింది. అలాగే నిలిచిపోయిన సబ్‌స్టేషన్ పనులను సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అందులో భాగంగా పాఠశాలకు వెనుకభాగాన మైదానంలో నిర్మించిన పిల్లర్స్ అడ్డంగా మారాయి. అలాగే గతంలో నిర్మించిన ప్రహరీ దిగువపట్నం కాలనీ వెళ్లే ఆ ప్రాంతవాసులు పాఠశాల గ్రౌండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వద్దకు తొందరగా వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని గోడను పగులకొట్టినట్లుగా స్థానికులు పేర్కొన్నారు. అయిదు సంవత్సరాల నుంచి ప్రహరీకి సంబంధించికానీ ఎలాంటి పనులు జరుగక అధికారులు కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అలాగే అదే మైదానంలో షటిల్ ఆడే షెడ్డు, దాని పక్కన స్థలం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పీఆర్‌హైస్కూలు మైదానాన్ని పరిశీలించి క్రీడాకారులు, వాకింగ్ చేసే స్థానికులకు ఇబ్బంది కలుగకుండా మైదానంలో శుభ్రం చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో క్రీడామైదానంలో మద్యం బాబులు తదితరులు అసాంఘిక కార్యకలాపాలు అధికంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన చెరుకూరి రవికుమార్



పోరుమామిళ్ల, జూలై 31 :సీఎం చంద్రబాబును కమ్మవారిపల్లెకు చెందిన టీడీపీ యువ నాయకుడు చెరుకూరి రవి కుమార్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజక వర్గ పరిస్థితులు వివరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి వారికి సముచితస్థానం కల్పించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

'ఉపాధి బిల్లులు చెల్లించండి'

రాజుపాలెం, జూలై 31 : పనులు లేని సమయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తుంటారు. అయితే ఈ పనులు చేసినందుకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. గత మే నెల 19తేదీ నుంచి ఇప్పటి వరకు పనిచేసిన దినాలకు డబ్బులు పడడం లేదని కూలీలు వాపోతున్నారు. ఎన్నో కుటుంబాలు ఈ డబ్బులకోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. డబ్బులు పడతాయన్న ఆశతో గ్రామాల్లోని తపాలా కార్యాలయం,బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎలక్షన్‌లో కోడ్ ఉన్నా బిల్లులు మాత్రం చకచకా పడ్డాయని, ఎన్నికలు అయిపోయిన తరువాత బిల్లులు జాప్యం జరుగుతుండడంతో కూలీలు ఆవేదన చెందుతున్నారు.మండలంలో 15 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 50 లక్షల నుంచి 60 లక్షలకు పైబడి బిల్లులు రావాల్సి ఉందని ఏపీవో లక్ష్మీనారాయణ తెలిపారు.

రేపు రాజోలి జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల

మైదుకూరు రూరల్ జూలై 31 : రాజోలీ జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మైదుకూరు,చాపాడు స్లూయిస్ ఎత్తి నీటిని విడుదల చేయనున్నారని ఆయన పీఏ ఆది తెలిపారు. కేసీ ఆయకట్టు కింద పంటలు పండించుకొనే రైతులు నీటి విడుదల వార్తలో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేసీ ఆయకట్టు క్రింద సుమారు 92 వేల ఎకరాలలో రైతులు పంటలు సాగుచేయనున్నారు.

ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీ

కొండాపురం, జూలై 31: మండలంలో ఎన్టీఆర్ భరోసా కింద గురువారం ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మండలంలో 100 శాతం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుం టున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి సదరం సర్టిఫికెట్లు పొంది నోటిసులు పొందిన దివ్యాంగులకు ఈ దఫా కూడా పింఛన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.కాగా ఎంక్వైరీ తర్వాత ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

కాశినాయన..: మండల వ్యాప్తంగా ఉన్న 17 పంచాయతీల పరిధిలో సామాజిక పింఛన్లు బుధవారం ఉదయం 6గం నుంచే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన నగదును మంగళవారం బ్యాంక్‌నుంచి డ్రా చేశామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బందిద్వారా పింఛన్ దారులకు ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందజేస్తామన్నారు.

గంధం వేడుకలు

పోరుమామిళ్ల, జూలై 31 : పట్టణంలోని హుస్సేన్‌పీర్ దర్గాలో ఉరుసు మహోత్సవ సందర్భంగా బుధవారం గంధంతో ప్రత్యేక పూజలు చేశారు. దేశాయి నరేంద్రరెడ్డి దర్గాకు గంధం తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ వారు పట్టణ వాసులకు పాట కచ్చేరి నిర్వహించారు.

రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలి

ఖాజీపేట, జూలై 31: రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని, విధులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. బుధవారం ఖాజీపేట పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. అలాగే పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు, సీఐ రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతమవుతున్న పెద్దదుద్యాల నిరసన

- ఫ్యాక్టరీ మూసేంతవరకు నిరసన కొనసాగిస్తాం:టీడీపీ నాయకులు



ఫ్యాక్టరీ ప్రాంగణంలో కాలుస్తున్న వ్యర్థాల వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

ముద్దనూరు జూలై31: మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది.వారికి మద్దతుగా టీడీపీ నాయకులు కడప నగర టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి,ముద్దనూరు మండల టీడీపీ నాయకులు కుడుముల శశిధర్‌రెడ్డి, రంగారెడ్డి సంఘీభావం తెలిపారు.ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.అందులో భాగంగా విజయలక్ష్మి మాట్లాడుతూఫ్యాక్టరీ పరిసర ప్రాంతంలోని వ్యర్థాలను కాల్చడమేకాకుండా భూమిలోకి పంపుతున్నారన్నారు.దీని కారణంగా విషపరమైన దుర్వాసన వస్తోందన్నారు. దాదాపు 15కిలోమీటర్ల దూరంలోని గ్రామాల ప్రజలకు ప్రమాదకరమన్నారు.గాలి, నీరు కలుషితంతో ప్రజల ఆరోగ్యానికి హానికల్పించడమే కాకుండా పశువులు, పక్షులు కూడా మృతి చెందుతున్నాయన్నారు.ఇంత ప్రమాదకరమైన ఫ్యాక్టరీ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యపు సమాధానం విడ్డూరంగా ఉందన్నారు.ఫ్యాక్టరీ మూతపడేంత వరకు నిరసన కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కౌన్సిలర్ల ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,జూలై 31 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నా టౌన్ ప్లానింగ్ ఏసీపీ చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో చైర్‌పర్సన్ బీమునిపల్లిలక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ హాజరయ్యారు. ఈసభలో కౌన్సిలర్ చింత కుంట సరితా మాట్లాడుతూ నడింపల్లెలో మున్సిపల్ కాలువను ఆక్రమించి ఇళ్లు నిర్మించారని గత సమావేశంలో వీటిపై ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ చర్యలుతీసుకోలేదని ఆరోపించారు. ఇందుకు ఏసీపీ సమాధానమిస్తూ కాలువను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను పరిశీలించి నోటీసులు ఇస్తామని తెలిపారు. కౌన్సిలర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ శ్రీరాముల పేటలో మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి వాణిజ్య సముదాయం నిర్మించినా ఏసీపీ మునిరత్నం చర్యలు తీసుకోలేదన్నారు. ఏసీపీ పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కోరారు. కాగా పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

కౌన్సిల్‌కు హాజరైన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ : గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ బీసీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ప్రొద్దుటూరు వాసి అయినా అతన్ని ఇంతకాలం కనీసం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌కు కూడా రానివ్వలేదు. ఏకంగా ప్రొద్దుటూరులో జరిగే ఏ అధికారిక కార్యక్రమానికి అతన్ని ఆహ్వానించటం గానీ చేయలేదు.కూటమి ప్రభుత్వం రావడంతో వైసీపీ ఎమ్మెల్సీకి కూడా స్వేచ్ఛలభించిందని రమేష్ వర్గీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

117 జీవో రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడండి

పోరుమామిళ్ల, జూలై 31 : 117 జీవో రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలోజరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ బడుల మనుగడ దినదినగండంగా మారిందన్నారు. గతప్రభుత్వం తీసుకువచ్చిన 177జీవో రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో గతంలోలాగా 1 నుంచి 5 వరకు ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, సత్తార్, రాంభూపాల్‌రెడ్డి, సుబ్బయ్య, అన్వర్‌బాషా, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

జంబు పొడితో ఇక్కట్లు



జమ్మలమడుగు, జూలై 31: మండలంలోని గొరిగెనూరు గ్రామం ఎస్సీ కాలనీలో ప్రజలు జంబుపొడితో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. ఇటీవల రెండు నెలల నుంచి పెన్నానదిలో గ్రామానికి దగ్గరలో ఎస్సీ కాలనీ వద్ద జంబు భారీగా పెరిగింది. దాంట్లో జంబు ఎండిపోయి అందుకు సంబంధించిన నుసి పొడి గాలికి గొరిగెనూరు గ్రామానికి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తోందని పిల్లలు, పెద్దలు బయటకు రావాలన్నా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇంటిముందు నిద్రించాలన్నా, తెల్లవారేసరికి జంబుపొడి నిండుకుంటుందని స్థానికులు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని జంబును పూర్తిగా తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

గిరిజనుల మెడికల్ క్యాంప్‌నకు స్పందన



మాట్లాడుతున్న బాబాఫకృద్దీన్

జమ్మలమడుగు, జూలై 31: జమ్మలమడుగు మండలంలోని చిటిమిటి చింతల (పాటి)లో బుధవారం నిర్వహించిన మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం చైర్మన్ శ్రీదేవి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని అంబవరం గ్రామ పంచాయతీ పరిధిలో చిటిమిటి చింతల గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి పలువురు డాక్టర్లు గిరిజనులకు వైద్య సదుపాయాలు అందించడం జరిగింది. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ న్యాయసేవా అధికార సంస్థ గిరిజన హక్కుల రక్షణ, అమలు పథకంపై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు జడ్జి భార్గవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ, అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, సీడీపీవో రాజేశ్వరిదేవి, బార్ సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీవో ముజఫర్, కుళాయమ్మ, శివచంద్రారెడ్డి, ఎస్ఐ కల్పన, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న కన్నారెడ్డి

చాపాడు, జూలై 31: జాతీయ, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై చేస్తున్న విచారణలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని రాష్ట్ర రీసోర్స్ పర్సన్ కన్నారెడ్డి పేర్కొన్నారు. చాపాడులోని ఉపాధి కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గ్రామాల్లో రీసోర్స్ పర్సన్లు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను గ్రామ సభల్లో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్లపై విచారణ చేస్తున్నామన్నారు. ఎంపీడీవో రంతులయ్య, ఏపీవో జగదీష్ మాట్లాడుతూ త్వరలో ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరులు గుర్తించి అభివృద్ధి చేయాలి

ఖాజీపేట, జూలై 31: నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ ఉమ్మడి వనరులను గుర్తించి అభివృద్ధి చేయాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి గ్రామంలో ప్రజలు ఐక్యతగా పనిచేయాలని, అలాగే మహిళా సంఘాలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. మండలస్థాయిలో ఉమ్మడి వనరులను అభివృద్ధే లక్ష్యంగా ఫౌండేషన్ ఫర్ ఎకోలాజికల్ సెక్యూరిటీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ స్నేహేష్, కోఆర్డినేటర్ రామకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడుగా వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రాణి, సహాయ కార్యదర్శిగా సౌజన్య, ఉపాధ్యక్షురాలిగా విజయశాంతి, కమిటీ సభ్యులుగా గురమ్మ, లక్ష్మీప్రసన్న, ఆనందమ్మ, రామాంజులరెడ్డి, మౌనికను ఎన్నుకున్నారు.

పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



రాజుపాలెం, జూలై 31 : టంగుటూరు గ్రామానికి చెందిన గుత్తి దస్తగిరి పంచాయతీ సెక్రటరీ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి దస్తగిరి 35 ఏళ్లుగా తనకు సుపరిచితురన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, టంగుటూరు టీడీపీ నాయకులు మానుకింది ఖాదర్‌బాషా, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉచితంగా స్టేషనరీ పంపిణీ

మైదుకూరు రూరల్ జూలై 31 : పట్టణ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పది,ఇంటర్ చదువుతున్న బాలికలకు గురువారం వివేకానందా ఫౌండేషన్ సంస్థ ద్వారా పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి బాలికలకు అట్టలు, పెన్నులు బాలికలకు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ విజయ, రెజీనా, మహబీబ్, నజ్మ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



ఇసుకను తీసుకుపోతున్న ట్రాక్టర్

చాపాడు, జూలై 31: మండలంలోని పెన్నా, కుందూ నదుల నుంచి కొంతమంది వ్యాపారస్తులు ఇసుకను అక్రమంగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రేయింబవళ్లు ట్రాక్టర్లతో ఇసుకను రవాణా చేస్తున్నారు. మైదుకూరు, చాపాడు పరిసర ప్రాంతాల నుంచి వచ్చి ఇసుకను ట్రాక్టర్లతో తీసుకెళుతున్నారు. ప్రతిరోజు సుమారు 50 ట్రాక్టర్లకు తీసుకుపోతున్నారు. పెన్నానది నుంచి రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె వెదురూరు గ్రామాల వద్ద కుందూనది నుంచి శ్రీరాములపేట, పెద్దగురవలూరు, చిన్నగురవలూరు, అల్లాడుపల్లె గ్రామాల వద్ద ఇసుక దోపిడీ చేస్తున్నారు. మైదుకూరు తదితర ప్రాంతాలకు తరలించి ఒక ట్రాక్టర్ రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. ముఖ్యమంత్రి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని చెబుతుంటే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్ఈబీ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, గనుల శాఖ అధికారులు కానీ ఇసుక అక్రమ రవాణాపై కన్నెత్తి చూడలేదు. దీంతో ట్రాక్టర్ యజమానులు జోరుగా ఇసుకను దోపిడీ చేస్తున్నారు. నదుల్లో గుంతలు ఏర్పడుతున్నాయి. ఇలాగే ఇసుకను తరలిస్తే తమకు తాగునీరు, సాగునీరు ఉండదని ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యసనాల నుంచి యువతను కాపాడాలి

మైదుకూరు రూరల్ జూలై 31 : జాతీయ ప్రచారక్ పేట్రియాట్ చీఫ్ ఆఫ్ చాంపియన్ శివసేవక్ శివకరణ్ జీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చెప్పులు లేకుండా కాలినడకన పాదయాత్ర చేస్తున్న నేపథ్యంలో బుధవారం మైదుకూరుకు విచ్చేశారు. ఆయనకు మైదుకూరులోని ఆర్ఎస్ఎస్ సేవకులు హరనాథ్, రామసుబ్బారెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం శివకరణ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు పాల్పడకుండా చూసేలా ప్రసంగించాలన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

బద్వేలు, జూలై 31 : పట్టణంలోని నాగభూషణం కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు 200 మంది అభ్యర్థులు పాల్గొన్నట్లు కళాశాల పరిపాలనాధికారి సాయిక్రిష్ణ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఫ్లిప్ కార్ట్, ఫాక్స్ కాన్ బెంగళూరు కంపెనీల వారు హాజరైనట్లు తెలిపారు. సుమారు 175 మందికి ఇంటర్వ్యూ ద్వారా ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.